క్లుప్తంగా

రేపటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

గంట్యాడ: మండలంలో మార్చి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు రెడ్డి కృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది మండలంలోని అన్ని గ్రామాలకు వచ్చి నాలుగు నెలలు దాటిన దూడలు, పశువులకు టీకాలు వేస్తారని పేర్కొన్నారు. పాడిరైతులు తమ పశువులకు ఈ టీకాలు వేయించాలని సూచించారు. గాలికుంటు వ్యాధి బారిన పడిన పాడి పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని, మరణాలూ సంభవిస్తాయని తెలిపారు.

ఆశ్రమాల్లో అన్నదానం



మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న శివ

కొత్తవలస: కోటపాడు రోడ్డులో ఉన్న చైతన్య మానసిక దివ్యాంగుల, బలిఘట్టాంలోని న్యూహోప్ అనాథ ఆశ్రమ పాఠశాల ల్లోని 92 మంది విద్యార్థులకు సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం రెండు పూటలా అన్నదానం చేశారు. ట్రస్టు వ్యవస్థాపకులు కనకాల శివ మాట్లాడుతూ మహాశివరాత్రిని పురస్కరించుకుని విద్యార్థులకు అన్నదానం చేశామని తెలిపారు. చైతన్య మానసిక దివ్యాంగుల పాఠశాల వ్యవస్థాపకుడు భోజింకి సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు పోటీలు



పరుగు తీస్తున్న ఎడ్లు

వేపాడ: మండలంలోని వావిలపాడు పంచాయతీ శివారు సంజీవమెట్ట గ్రామంలో అభయాంజనేయ స్వామి తీర్థం సందర్భంగా గురువారం నిర్వహించిన ఎడ్ల పరుగు పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో పది జతల ఎడ్లు పాల్గొనగా వావిలపాడుకు చెందిన పరదేశిమాంబ ఎడ్లు ప్రథమస్థానంలో నిలిచాయి. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన ఎడ్లకు సంబంధించిన యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. తీర్థం సందర్భంగా సాయంత్రం కోలాటం, బుర్రకథ ఏర్పాటు చేశారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర ప్రసాద్

విజయనగరం: ప్రపంచ ఎన్జీఓ దినోత్సవం సందర్భంగా మదర్ థెరీసా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. నగరంలోని అయ్యన్నపేట జంక్షన్ వద్ద గల కిడ్స్ క్లబ్‌లో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని విజయనగరం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రవిశంకర ప్రసాద్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంవీఐ రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. వాహన చోదకులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మదర్ థెరీసా సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు త్యాడ వేణుగోపాలం, ఎస్‌కే డిగ్రీ కాలేజ్ ఎన్‌సీసీ ఆఫీసర్ సన్యాసినాయుడు, ఉపాధ్యాయులు శ్రావణి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఆధార్ సేవలు

వేపాడ: శింగరాయి గ్రామ సచివాలయంలో కొద్దిరోజుల క్రితం ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌లో సేవలు శుక్రవారం తో ముగియనున్నాయని పంచాయతీ కార్యదర్శి సత్యవతి గురువారం తెలిపారు. ఎంపీడీఓ సీహెచ్.సూర్యనారాయ ణ ఆదేశాల మేరకు సచివాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశామని చెప్పారు. శింగరాయి, జగ్గయ్యపేట, అరిగి పాలెం గ్రామాల వారికి ఆధార్ కార్డుల్లో మార్పులు, సవరణలు, ఇతర సేవలందించామని, ఇంకా ఈసేవలు పొందాలనుకునే వారు ఎవరైనా ఉంటే శుక్రవారం సాయంత్రంలోగా సచివాలయంలో సంప్రదించాలని సూచించారు.

హుండీల ఆదాయం లెక్కింపు..

డెంకాడ : మండలంలోని జొన్నాడ గ్రామంలో వేంచేసి ఉన్న పైడితల్లి ఆలయంలో గురువారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఈ నెల 13 నుంచి 27 వరకు 1,55,913 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి జి.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఏకసభ్య ధర్మకర్త జి.శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, గ్రామపెద్దలు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తఝురితో పులకించిన 'పుణ్యగిరి'

- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- నిరంతరాయంగా దర్శనాలు

శృంగవరపుకోట: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం రాత్రి జాగరణ చేసిన భక్తులు గురువారం పుణ్యగిరి బాటపట్టారు. మెట్లమార్గంలో భక్తులు పంచాక్షరీ పఠనంతో కొండపై ఉన్న ఆలయానికి చేరుకుని ఉమాకోటిలింగేశ్వరుని దర్శించుకున్నారు. విజయ నగరంతో పాటు ఉత్తరాంధ్రలోని జిల్లాల నుంచి భక్తులు బుధవారం ఉదయం నుంచి గురువారం సాయంత్రం వరకూ వస్తూనే ఉన్నారు. గురువారం రాత్రి వరకు దర్శనాలు నిరాటంకంగా కొనసాగాయి. భక్తులు పుట్టుధార, ధారగంగమ్మ లోయల్లో స్నానాలు చేసేందుకు పోటీపడ్డారు. బుధవారం రాత్రి లింగోద్భవ సమయంలో అర్చకులు స్వామికి పంచామృతాభిషేకం, మహన్యాసపూర్వకంగా రుద్రాభిషేకం చేశారు. భక్తుల సౌకర్యార్థం ఉచితం, శీఘ్ర, విశిష్ట దర్శనాలు కల్పించారు. మెట్ల మార్గంలో చెట్లు లేక నీడ కరువై చంటిబిడ్డలు, వృద్ధులు, మహిళలు అల్లాడిపోయారు. ఉమాపతిని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు బుధవారం ఉదయం, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం దర్శించుకున్నారు.

భక్తుల సేవలో స్వచ్ఛంద సంస్థలు

పుణ్యగిరికి తరలివచ్చిన వేలాది మంది భక్తులకు స్వచ్ఛంద సంస్థలు సేవలందించాయి. బాబాసేవాయోగి ఆశ్రమ నిర్వాహకులు నిరంతరాయంగా అన్నదానం, అల్పాహారం, కాఫీ,టీలు ఏర్పాటు చేసి భక్తులకు సేవ చేశారు. అలాగే పలు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, పాఠశాలల యాజ మాన్యాలు భక్తులకు వాటర్‌ప్యాకెట్లు, మజ్జిగ, పుచ్చకాయలు, ఉసిరికాయలు, పులిహోర, పరమాన్నం, గోధుమరవ్వ ప్రసాదాలు పంపిణీ చేశారు.



పుణ్యగిరి మెట్ల మార్గంలో ఆలయానికి వెళుతున్న భక్తులు

ప్రశాంతంగా ముగిసిన జాతర

పోలీసులతో పాటు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయడంతో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా పుణ్యగిరి జాతర ప్రశాంతంగా ముగిసింది. ఆర్టీసీ బుధవారం ఉదయం నుంచి గురువారం సాయంత్రం వరకు ప్రత్యేక బస్సులు నడపగా, పోలీసులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, పంచాయతీరాజ్, దేవదాయశాఖ ఉద్యోగులు నిరంతర సేవలందించారు. సీసీ కెమెరాల నిఘాలో పోలీసులు జాతరను పర్యవేక్షించారు.. వన్‌వే ఏర్పాటు చేయడంతో పాటు, పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించడం, వీరికి స్థానిక కళాశాలల ఎన్‌సీసీ బృందాలు సహకరించడంతో ఎవ్వరికీ ఇబ్బందులు లేకుండా జాతర సాఫీగా సాగిపోయింది.



దర్శనానికి వెళుతున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి, వైఎస్సార్‌సీపీ నాయకులు



పుణ్యగిరి దారిలో వంతెనపై కిక్కిరిసిన భక్తులు



దారగంగమ్మ లోయలో స్నానాలు చేస్తున్న భక్తులు



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న బొద్దాం నూకాలమ్మ యూత్ అసోసియేషన్ సభ్యులు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతం



చీపురుపల్లిరూరల్(గరివిడి): కొండపాలెంలో పోలింగ్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటున్న ఆర్డీఓ సత్యవాణి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజ కవ ర్గాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకు న్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4గంటలకు ముగిసింది. తహసీల్దార్లు, ఎంపీడీఓలు పోలింగ్‌ను పర్యవేక్షించారు. గరివిడి మండలంలోని కొండపాలెం హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని చీపురుపల్లి ఆర్డీఓ సత్యవాణి, సెక్టోరియల్ అధికారి వై.వి.రమణ, గంట్యాడ హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని విజయనగరం ఆర్డీఓ దాట్ల కీర్తి పరిశీలించారు. గజపతినగరం బాలుర హైస్కూల్‌లో పోలింగ్ తీరును పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి పరిశీలించారు.

–సాక్షి నెట్ వర్క్



గంట్యాడ : గంట్యాడలో పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ కీర్తి



దత్తిరాజేరు: దత్తిరాజేరులో పోలింగ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు రమేష్

కట్టె పడేస్తున్న జనుము



కట్టె జనుము పంట పూత దశకు వచ్చింది. చేనంతా పసుపు పూలతో చూపరులను కట్టిపడేస్తోంది. వేపాడ, బానాది, నల్లబిల్లి, వావిలపాడు, వల్లంపూడి, జగ్గయ్యపేట గ్రామాల్లో రోడ్డు పక్క పొలాల్లో సాగులో ఉన్న కట్టె జనుము చేను పూలతో ఆకట్టుకుంటోంది. ఆయా మార్గాల్లో ప్రయాణించే వారిలో కొందరు ఫొటోలు,సెల్ఫీలు దిగుతున్నారు. – వేపాడ

కనకమహాలక్ష్మి జాతర ఏర్పాట్ల పరిశీలన

చీపురుపల్లి: స్థానిక శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద మార్చి 2,3,4వ తేదీల్లో జాతర నిర్వహించనున్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం చీపురుపల్లి వచ్చి దేవస్థానం వద్ద జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. క్యూలైన్లు, వీఐపీల వాహన రాకపోకలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై స్థానిక పోలీసు అధికారులను ఆరా తీశారు. సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించేందుకు ఎంతమంది జనం హాజరు కావచ్చని పోలీసులను అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం తగిన క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎలాంటి అశ్లీల నృత్యాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ఆయన వెంట డీఎస్పీ ఎస్.రాఘువులు, చీపురుపల్లి, గరివిడి ఎస్‌ఐలు ఎల్.దామోదరరావు, లోకేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, గవిడి నాగరాజు, విజనగిరి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

వారికి ఎన్నికల నిబంధనలు వర్తించవా..?



ఎన్నికల సిబ్బందిని ప్రశ్నిస్తున్న యూటీఎఫ్ నాయకుడు వెంకటనాయుడు

కొత్తవలస: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం మద్దతు తెలిపిన ఏపీటీఎఫ్ వారికి ఎన్నికల నిబంధనలు వర్తించవా అని యూటీఎఫ్ జిల్లా నాయకుడు జి.వెంకటనాయుడు అధికారులను ప్రశ్నించారు. కొత్తవలస ఉన్నత పాఠశాల కేంద్రంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం నిర్వహించారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్లలోపు అభ్యర్థులకు సంబంధించిన శిబిరాలు ఏర్పాటు చేయకూడదని అధికారులు నిబంధనలు విధించారు. అయితే కూటమి ప్రభుత్వం మద్దతు తెలిపిన ఏపీటీఎఫ్ అభ్యర్థి రఘువర్మకు సంబంధించిన శిబిరాన్ని నిబంధనలకు అతీతంగా పోలింగ్ కేంద్రానికి సమీపంలో ఏర్పాటు చేశారు. దీనిపై యూటీఎఫ్ నాయకుడు వెంకటనాయుడు అభ్యంతరం తెలిపారు. కూటమి ప్రభుత్వం మద్దతు తెలిపిన అభ్యర్థికి ఒక విధంగా, మిగతా వారికి మరో లా నిబంధనలు ఉంటాయా అని అధికారులతో వాగ్వాదానికి దిగారు. తహసీల్దార్ నీలకంఠరావు,ఎస్‌ఐ సుదర్శన స్పందించి ఏపీటీఎఫ్ శిబిరాన్ని తొలగించారు. దీంతో మిగిలిన వారు శాంతించారు.

శివోహం



వేపాడ: బొద్దాం శివాలయంలో స్వామివారికి పూలాభిషేకం

మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం జాగరణ చేసిన భక్తులు గురువారం వేకువ జాము నుంచే శివాలయాలకు పోటెత్తారు. గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని శివాలయాల్లో భక్తులతో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. మహిళలు దీపారాధన చేశారు. పలుగ్రామాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు

– సాక్షి నెట్‌వర్క్



బొండపల్లి: దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



గజపతినగరం: గజపతినగరంలోని శివాలయం ఆవరణలో దీపారాధన చేస్తున్న మహిళలు

వైభవంగా శివపార్వతుల కల్యాణం



తుమ్మికాపల్లిలో శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

కొత్తవలస: తుమ్మికాపల్లి గేటు సమీపంలోని ఉమామహేశ్వర ఆలయంలో వేదపండితులు అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో గురువారం శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అలాగే రామలింగాపురంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో సామూహిక రుద్రాభిషేకాలు చేశారు.




రామలింగాపురం శివాలయంలో రుద్రాభిషేకాలు చేస్తున్న భక్తులు

మూణ్నాళ్ల ముచ్చటే..!

గంట్యాడ: రోడ్లకు మరమ్మతులు చేపట్టి గ్రామీణ ప్రాంతాల్లో గుంతలు లేని రోడ్లను తయారు చేస్తున్నామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. కానీ వాస్తవ పరిస్థితులు అందు కు విరుద్ధంగా ఉన్నాయి. రోడ్ల మరమ్మతులు, నిర్మాణ కాంట్రాక్టులను కూటమి నేతలకే ప్రభుత్వం కట్టబెడుతుండడంతో వారు ప్రజాధనాన్ని దోచుకోవడానికి గేట్లు తెరిచారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్ల మరమ్మతులు, కొత్తరోడ్ల నిర్మాణం చేపట్టేది అధికార పార్టీకి చెందిన వారే కావడంతో నాణ్యత పాటించకపోయినా పట్టించుకునే వారు లేరనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని కొటారుబిల్లి జంక్షన్ నుంచి పెదవేమలి గ్రామం మీదుగా విజయనగరం మండలంలోని జొన్నవలస జంక్షన్ వరకు 17 కిలోమీటర్ల మేర ఇటీవల ప్యాచ్ వర్క్ చేశారు. వారం క్రితమే ప్యాచ్‌వర్క్(మరమ్మతులు) చేపట్టారు. పెదవేమలి నుంచి కొటారుబిల్లి రోడ్డులో చేపట్టిన ప్యాచ్ వర్క్‌లో రెండు చోట్ల చిప్స్ తేలాయి. లక్కిడాం జంక్షన్‌లో ఎర్రయ్యమ్మ పేరంటాల గుడి వద్ద, మురపాక సమీపంలోని సూర్యరాజ్ మిల్లు వద్ద ప్యాచ్ వర్క్ చేసిన చోట చిప్స్ తేలాయి. ఇది చూసిన వారంతా రోడ్డు మరమ్మతుల పనులు మూణ్నాళ్ల ముచ్చటగా తయారయ్యాయని ఆయా మార్గాల్లో ప్రయా ణించే వారు ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని ఆర్‌అండ్‌బీ ఓఈ విక్రమ్ వద్ద సాక్షి ప్రస్తావించగా బరువైన వాహనం వెళ్లినప్పుడు రాళ్లు తేలుతాయని, రాళ్లు తేలిన చోట మళ్లీ మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.



మురపాక సమీపంలోని సూర్యరాజ్ మిల్లు వద్ద రోడ్డుపై తేలిన చిప్స్



లక్కిడాం జంక్షన్‌లో ఎర్రయ్యమ్మ పేరాంటాల గుడి వద్ద తేలిన చిప్స్

ఇది తారురోడ్డే..!

లక్కవరపుకోట: ఆర్‌అండ్‌బీ రోడ్డు అంటే కనీసం మచ్చుకైనా తారు కనిపించాలి. కానీ మండలంలోని గంగుబూడి జంక్షన్ నుంచి తామరాపల్లికి వెళ్లే రోడ్డు మాత్రం కొన్నిచోట్ల పూర్తిగా మట్టిరోడ్డు లాగే కనిపిస్తోంది. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రూ.3 లక్షలతో ఈరోడ్డులో ఇటీవల మరమ్మతులు చేయించారు. సంక్రాంతి పండగకు బాగు చేసిన రోడ్డు శివరాత్రి పండగకు పూర్తిగా మట్టిరోడ్డులా మారిపోయింది..సుమారు 5 కిలోమీటర్ల పొడువు ఉన్న ఈ రోడ్డులో రూ.3లక్షలతో మరమ్మతులు చేశారు. అయితే గంగుబూడి,గజపతినగరం గ్రామాల వద్ద రోడ్డు గ్రావెల్ రోడ్డులా ఉంది. ఆర్‌అండ్‌బీ జేఈ శ్రీనివాస్ వద్ద సాక్షి ఈ విషయం ప్రస్తావించగా రోడ్డు మరమ్మతులు చేయించామని, కొన్ని ప్రదేశాల్లో రోడ్డుపై మట్టిపేరుకుపోయిందని వివరించారు.



గజపతినగరం వద్ద గ్రావెల్ రోడ్డులా ఉన్న ఆర్‌అండ్‌బీ బీటీ రోడ్డు



గంగుబూడి సమీపంలో ఇలా..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లి: పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీహరి గురువారం ఓ ప్రకటనలో తెలి పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు చీపురుపల్లి పట్టణంలోని రిక్షాకాలనీ, జి.అగ్రహారం, పిల్లపేట, జగన్నాథరాజుకాలనీ, ఆంజనేయపురం, వంగపల్లిపేట, కుమ్మరివీధి, విజయా కాలనీ, కొత్తగవిడివీధి, రెడ్డిపేటతో పాటు మండలంలోని రావివలస, విజయ రాంపురం, నాగంపేట, కొత్తపేట,పైలపేట, గురాన పేట, గరివిడి మండలంలో ని బి.జి.పాలెం , మందిరవలస, కాపుశంభాం, కొండశంభాం, అప్పన్నవలస గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గజపతినగరం టౌన్ ఫీడర్ పరిధిలో..

గజపతినగరం: స్థానిక టౌన్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ బొబ్బిలి కార్యనిర్వాహక (ఆపరేషన్) ఇంజినీర్ ఏ.అనంతరావు గురువారం ఓ ప్రకటన లో తెలిపారు.విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో గజపతినగరం దిగువ వీధి, కుమ్మరవీధి, మేదర వీధి, పాట్టావారి వీధి, బీసీ కాలనీ, తానా వీధి, తహసీల్దార్ కార్యాలయ రోడ్డులోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రాచకిండాం ఫీడర్ పరిధిలో...

బొండపల్లి: మండలంలోని రాచకిండాం విద్యుత్ ఫీడర్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈఈ ఆర్.శంకరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాచకిం డాం, కనిమెరక, గిట్టుపల్లి, చామలవలస గ్రామాలకు సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.